సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

ఆదివారం । 1 । జనవరి । 2023

కొత్తగా 88 దేవాలయాల నిర్మాణం

జిల్లాలో కొత్తగా 88 దేవాలయాలను నిర్మించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని దేవాదాయశాఖ ఏసీ శంకర్ బాలాజీ తెలిపారు.
-కడప కల్చరల్



జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి బాధ్యతల స్వీకరణ



జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారిగా శారదమ్మ బాధ్యతలు స్వీకరించారు. ఆమెకు ఏపీ జూనియర్ అండ్ వెటర్నరీ లైవ్‌స్టాక్ ఆఫీసర్స్ అసోసియేషన్, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. -కడప అగ్రికల్చర్

వాతావరణం

గరిష్టం/కనిష్టం
32.1/17.3

జిల్లాలో శనివారం 17.3 - 32.1 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 1.8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
-కడప అగ్రికల్చర్

పింఛనోత్సాహం



● రూ. 2500 నుంచిరూ. 2750కు పింఛన్ పెంపు ● 2.11 లక్షల మందికి లబ్ధి
● కొత్తగా 7,609 మందికి పింఛన్ల మంజూరు ● నేడు కొత్త సంవత్సరం వేళ పండుటాకులకు పింఛన్ల పండుగ

కడప రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వైఎస్సార్ పింఛన్ కానుక కింద పింఛన్ల సొమ్మును పెంచారు. అర్హులైన వారికి కొత్త పింఛన్లను మంజూరు చేశారు. తద్వారా అవ్వాతాతలు, అభాగ్యుల్లో భరోసాను నింపారు.

పింఛన్ల పెంపుతో ప్రతి నెలా రూ.5.27 కోట్లకు పైగా అదనపు భారం

జిల్లాలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ద్వారా ప్రస్తుతం ప్రతి నెలా ఒకటో తేదీన ఠంచన్‌గా వలంటీర్ల ద్వారా మొత్తం 16 రకాల పింఛన్లను పంపిణీ చేస్తున్నారు. ఆ మేరకు 2022 డిసెంబర్ 1వ తేదీన మొత్తం 2,56,847 మందికి రూ. 63.76 కోట్లకు పైగా పింపిణీ చేశారు. తాజాగా ప్రభుత్వం పింఛన్ సొమ్మును ఒకరికి రూ. 2,500 నుంచి రూ. 2,750కు పెంచింది. 16 రకాల పింఛన్లు మొత్తం 2,56,847లో ఏడు కేటగిరీలకు చెందిన వృద్ధులు, వితంతువులు, చేనేత, ఒంటరి మహిళ, మత్స్యకారులు, కల్లు గీత, చర్మకారులు మొత్తం 2.11 లక్షల మంది ఉన్నారు. ఇప్పటి వరకు వీరు ఒకరు ప్రతి నెలా రూ. 2,500 చొప్పున మొత్తం రూ. 52,75,00,000 పొందుతున్నారు. ప్రభుత్వం జనవరి 1వ తేదీ నుంచి పింఛన్‌ను రూ. 2500 నుంచి రూ. 2750కు పెంచింది. దీంతో కేవలం జిల్లాలోని 2.11 లక్షల మంది లబ్ధిదారుల పైనే ప్రతి నెలా రూ. 5,27,50,000 అదనపు భారం పడనుంది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక రూ. 2 వేలు ఉన్న పింఛన్‌ను దశల వారీగా రూ. 3 వేలు చేస్తామని హామీ ఇచ్చారు. ఆ ప్రకారం ప్రతి ఏటా జనవరి 1వ తేదీన పింఛన్ సొమ్మును రెట్టింపు చేస్తూ రూ. 3 వేల దిశగా అడుగులు వేస్తున్నారు.

జిల్లాలో కొత్త పింఛన్ల మంజూరు వివరాలు

కేటగిరి	పింఛన్లు
వృద్ధులు	2,457
వితంతువులు	2,396
దివ్యాంగులు	2,274
డప్పు కళాకారులు	200
చేనేత	114
చర్మకారులు	112
మత్స్యకారులు	17
ఒంటరి మహిళ	31
కల్లుగీత	02
ట్రాన్స్‌జెండర్	06
మొత్తం	7,609

క్రమం తప్పకుండా కొత్త పింఛన్ల మంజూరు

ఈ ప్రభుత్వం క్రమం తప్పకుండా ప్రతి ఏటా జనవరి, జూలై మాసంలో కొత్త పింఛన్లను మంజూరు చేస్తోంది. ఆ ప్రకారం 2023 జనవరి ఒకటవ తేదీన ఏడు కేటగిరీలకు చెందిన మొత్తం 7,509 మందికి కొత్తగా పింఛన్లను మంజూరు చేశారు. వారంతా తాజాగా పెరిగిన పింఛన్ ప్రకారం ఒకరు రూ. 2,750 చొప్పున తీసుకుంటారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం క్రమం తప్పకుండా పింఛన్ల సొమ్మును పెంచడంతో పాటు కొత్త పింఛన్లను మంజూరు చేయడం పట్ల అవ్వాతాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తమకు కొత్త సంవత్సరంతోపాటు..రాబోవు సంక్రాంతి సంబరాలు ఇప్పుడే వచ్చాయని సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

నేటి నుంచి పింఛన్ల పంపిణీ



వైఎస్సార్ పింఛన్ కానుక కింద యధావిధిగా పెంచిన పింఛన్ల సొమ్ము, కొత్త పింఛన్ల మంజూరుతో పాటు అన్ని కేటగిరీలకు చెందిన పింఛన్లను ఆదివారం నుంచి వలంటీర్ల ద్వారా ఇంటింటికీ పంపిణీ చేస్తాం. పింఛన్ల వలన లబ్ధిదారులకు ఆర్థిక భరోసా లభిస్తోంది. ఇది బృహత్తర పథకం. పంపిణీకి అన్ని చర్యలు చేపట్టాం. - పెద్దిరాజు, ప్రాజెక్ట్ డైరెక్టర్, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ.

శాంతిసౌభాగ్యాలతో విలసిల్లాలి



ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి — డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కోటిరెడ్డిసర్కిల్ : కోటి ఆశలతో కొత్త సంవత్సరంలో అడుగిడుగుతున్న జిల్లా ప్రజలకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎస్‌బీ అంజద్‌బాష, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆదిమూలపు సురేష్, కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, కలెక్టర్ విజయరామరాజు, ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ తదితరులు శనివారం ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. ఈ నూతన సంవత్సరం ప్రతి ఒక్కరికీ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు చేకూరాలని.. ప్రభుత్వ సుపరిపాలనలో ప్రజలకు సంతృప్త స్థాయిలో సంక్షేమ ఫలాలు అందాలని ఆకాంక్షించారు. ప్రతి ఇల్లు శాంతిసౌభాగ్యాలతో విలసిల్లాలన్నారు. కోవిడ్ నిబంధనలు పాటిస్తూ నూతన సంవత్సర వేడుకలు నిర్వహించుకోవాలని సూచించారు.

వైవీయూ అంతర్ కళాశాలల చాంపియన్‌గా ప్రొద్దుటూరు జట్లు

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల ఖోఖో చాంపియన్‌లుగా ప్రొద్దుటూరు జట్లు నిలిచాయి. శనివారం వైవీయూలో నిర్వహించిన పోటీల్లో మహిళల విభాగంలో ప్రొద్దుటూరుకు చెందిన వేదవ్యాస డిగ్రీ కళాశాల జట్టు చాంపియన్‌గా నిలిచింది. రెండోస్థానంలో ఆర్‌సీపీఈ జట్టు నిలిచింది. మూడోస్థానంలో వైవీయూ జట్టు నిలిచింది. పురుషుల విభాగంలో విజేతగా ప్రొద్దుటూరు ఆర్‌సీపీఈ జట్టు నిలిచింది. రెండోస్థానంలో కడప శ్రీహరి డిగ్రీ కళాశాల జట్టు నిలువగా, మూడో స్థానంలో వైవీయూ జట్టు నిలిచింది. విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు వైవీయూ క్రీడాబోర్డు కార్యదర్శి డాక్టర్ కె. రామసుబ్బారెడ్డి, ఖోఖో పోటీల పరిశీలకుడు, జాతీయ ఖోఖో క్రీడాకారుడు కాశీ విశ్వనాథ్‌రెడ్డిలు మెడల్స్, సర్టిఫికెట్లు అందజేశారు.



మహిళల విభాగం విజేతగా నిలిచిన ప్రొద్దుటూరు వేదవ్యాస జట్టు



పురుషుల విభాగం విజేతగా నిలిచిన ప్రొద్దుటూరు ఆర్‌సీపీఈ జట్టు

జగనన్న ఇళ్ల నిర్మాణాల పరిశీలన

జమ్మలమడుగు రూరల్: జమ్మలమడుగు మండలం అంబవరం గ్రామం వద్ద జగనన్న కాలనీలో ఇంటి నిర్మాణాలను జిల్లా కలెక్టర్ విజయరామరాజు పరిశీలించారు. శనివారం ఆర్డీఓ కార్యాలయానికి చేరుకున్న కలెక్టర్ ఆ తరువాత ఆర్డీఓ జి. శ్రీనివాసులుతో కలసి జగనన్న కాలనీకి వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అన్ని చోట్ల కంటే జమ్మలమడుగు జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణం వేగవంతంగా జరుగుతోందని సంతృప్తి వ్యక్తం చేశారు. మునిసిపల్ కమిషనర్ జి. వెంకటరామిరెడ్డి,తహసీల్దార్ రవీంద్రారెడ్డి పాల్గొన్నారు.

కొండాపురం: గండికోట జలాశయం కింద ముంపునకు గురైన కె.సుగుమంచిపల్లెలో సగం గ్రామానికి కాకుండా గ్రామం మొత్తం ముంపు కింద పరిగణించి పరిహారం ఇవ్వాలని గ్రామస్తులు కలెక్టర్ విజయరామరాజును కోరారు. శనివారం మండలంలోని కె.సుగుమంచిపల్లె గ్రామాన్ని కలెక్టర్ ఆకస్మికంగా పరిశీలించారు. ఆర్డీఓ శ్రీనివాసులు, తహసీల్దార్ శోభన్‌బాబు పాల్గొన్నారు.

చాపాడు: లక్ష్మీపేట గ్రామంలోని ఆరోగ్య ఉప కేంద్రాన్ని, పశువైద్యశాలను శనివారం కలెక్టర్ విజయరామరాజు పరిశీలించారు. సిబ్బందితో మాట్లాడారు.

స్ఫూర్తి ప్రదాతల కీర్తిని శాశ్వతం చేద్దాం



బుడ్డా వెంగళరెడ్డి పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

బుడ్డా వెంగళరెడ్డి వర్ధంతి సభలో వక్తలు

కడప కల్చరల్: సమాజంలో అన్ని వర్గాలు ఆనందంగా ఉండాలని, సాటి మనిషిని కష్టకాలంలో ఆదుకోవడం మానవుని కనీస ధర్మమని, దాంతో విలువలు పెరుగుతాయని పలువురు వక్తలు పేర్కొన్నారు. శనివారం స్థానిక బ్రౌన్ గ్రంథాలయంలో రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ, బాసట స్వచ్ఛంద సేవా సంస్థ మహాదాత బుడ్డా వెంగళరెడ్డి 122వ వర్ధంతి సభను నిర్వహించాయి. బుడ్డా వెంగళరెడ్డి చిత్రపటానికి పూలమాల అలంకరించిన అతిథులు ఘనంగా నివాళులర్పించారు. ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి మాట్లాడుతూ తనకు కూడా దానధర్మాలు చేయడమంటే ఇష్టమని, బుడ్డా వెంగళరెడ్డి గురించి తెలిశాక ఆసక్తి మరింత పెరిగిందన్నారు. అలాంటి మహానుభావుల గురించి ఏదైనా మంచి పని తలపెడితే తాను తప్పక సహకరిస్తానన్నారు. ఎమ్మెల్సీ సి.రామచంద్రయ్య మాట్లాడుతూ రాయలసీమకు చెందిన బుడ్డా వెంగళరెడ్డి లాంటి దాతల గురించి నేటి తరానికి తెలిపి వారిలో స్ఫూర్తి నింపేందుకు కృషి చేస్తున్న వ్యక్తులు, సంస్థలను అభినందించారు. వెంగళరెడ్డి చరిత్రను పాఠ్యాంశంలో చేర్చాలని సూచించారు. సభాధ్యక్షుడు, మున్సిపల్ మాజీ చైర్మన్ హరీంద్రనాథ్ మాట్లాడుతూ దాతృత్వం కరువైన నేటి సమాజంలో బుడ్డా వెంగళరెడ్డి లాంటి వారి కీర్తికి శాశ్వతత్వం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్‌కడప అన్నమయ్య పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ మానస చిన్నపరెడ్డి మాట్లాడుతూ బాల్యం నుంచే పిల్లలకు తల్లిదండ్రులు సేవా గుణాన్ని నేర్పాలన్నారు. బుడ్డా వెంగళరెడ్డి కీర్తిని శాశ్వత పరిచేందుకు తన సహకారం ఉంటుందన్నారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ముఖ్య బాధ్యులు బైరెడ్డి రామకృష్ణారెడ్డి, రాటాల గోపిలు మాట్లాడుతూ కడప నగరంలో బుడ్డా వెంగళరెడ్డి విగ్రహ స్థాపన జరిగితే నాల్గవ వంతు ఆర్థికసాయం చేస్తామన్నారు. రెడ్డి సేవా సమితి ప్రధాన కార్యదర్శి లెక్కల కొండారెడ్డి మాట్లాడుతూ తాము సైతం విగ్రహం ఏర్పాటుకు సహకరిస్తామన్నారు. స్థానిక ప్రముఖులు దేసు వెంకటరెడ్డి కూడా మాట్లాడారు.

ఆవిష్కరణ: బాసట సంస్థ అధ్యక్షుడు మేరువ బాలాజీరావు పర్యవేక్షణలో పాత్రికేయుడు ఫణి రూపొందించిన మహాదాత బుడ్డా వెంగళరెడ్డి పుస్తకాన్ని అతిథులు ఈ సందర్భంగా ఆవిష్కరించారు.

తీర్మానాలు: ఈ సందర్భంగా పీడీఎస్‌యూ ప్రధాన కార్యదర్శి ఓరుగంటి నాగేంద్రబాబు నగరంలో ఉయ్యాలవాడ నరసింహారెడ్డి, బుడ్డా వెంగళరెడ్డి, వేమన కాంస్య విగ్రహాల ఏర్పాటుతోపాటు వారి సేవలను విద్యార్థులకు పాఠ్యాంశాలుగా పెట్టాలని, వీరి వర్ధంతిని ఏటా ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని, వారి నివాసాలను స్మారక చిహ్నాలుగా గుర్తించాలని ప్రవేశపెట్టిన తీర్మానాలను సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ కార్యక్రమంలో పలు ప్రజా సంఘాలు,ఉపాధ్యాయ, ఉద్యోగ, విద్యార్థి, దళిత, మేధావి సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.














న్యాయమూర్తి ఎస్.సోలమన్‌రాజును సన్మానిస్తున్న న్యాయవాదులు

న్యాయమూర్తి సోలమన్‌రాజుకు
ఘన వీడ్కోలు

కడప అర్బన్ : జిల్లా ప్రధాన న్యాయమూర్తి సోలమన్‌రాజు పదవీ విరమణ సందర్భంగా ఆయనకు ఘనంగా వీడ్కోలు పలికారు. స్థానిక కడప న్యాయవాదుల సంఘం భవనంలో ఆయనను జడ్జిలు, న్యాయవాదులు, సిబ్బంది శనివారం ఘనంగా సన్మానించారు. న్యాయమూర్తులు సి.ఎస్.మూర్తి, మోతీలాల్, రియాజ్, ప్రదీప్ కుమార్, డీఎల్ఎస్ఏ సెక్రటరీ కవిత, కడప న్యాయవాదుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు జి.రామలింగారెడ్డి, వై.టి.జాన్సన్ కెన్నెడీ, వైస్ ప్రెసిడెంట్ ఎస్.నాగశేఖర్, జాయింట్ సెక్రటరీ ఏ.బాలసుబ్బయ్య, మహిళా కార్యదర్శి చంద్రవదన తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి క్రికెట్ సంబరం ప్రారంభం

తలపడనున్న ఆంధ్ర, అరుణాచల్‌ప్రదేశ్ జట్లు

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని వైఎస్ రాజారెడ్డి-ఏసీఏ క్రికెట్ మైదానం వేదికగా నూతన సంవత్సరం ఆరంభంలో క్రికెట్ సంబరం ప్రారంభం కానుంది. కల్నల్ సీకే నాయుడు ట్రోఫీలో భాగంగా అంతర్ రాష్ట్రాల క్రికెట్ పోటీల్లో భాగంగా జనవరి 1 నుంచి 4వ తేదీ వరకు ఆంధ్ర, అరుణాచల్ ప్రదేశ్ జట్ల మధ్య అండర్-25 మల్టీడేస్ క్రికెట్ మ్యాచ్ ప్రారంభం కానుంది. మ్యాచ్ నిర్వహణ కోసం క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ వైఎస్ఆర్ డిస్ట్రిక్ట్ అన్ని ఏర్పాట్లను పూర్తి చేసింది. దీంతో పాటు మైదానాన్ని అందంగా తీర్చిదిద్దారు. రంజీ మ్యాచ్‌లలో ఆడిన క్రీడాకారులు ఉండటంతో మ్యాచ్‌లు రసవత్తరంగా సాగే అవకాశాలు ఉన్నాయి. మ్యాచ్‌ల నిర్వహణలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు సీఏవైడీ జిల్లా అధ్యక్షుడు ఎం.భరత్‌రెడ్డి, కార్యదర్శి పి.సంజయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

ఆంధ్రా జట్టు : పి.గిరినాథ్‌రెడ్డి (కెప్టెన్), వై.సందీప్, టి.వంశీకృష్ణ, ఎం.హర్షవర్ధన్, కె.మహీప్‌కుమార్, ఎస్.తరుణ్, ఎస్.ధృవకుమార్‌రెడ్డి, పి.అవినాష్, టి.విజయ్, ఎస్.కె.ఇస్మాయిల్, ఎం.ఆంజనేయులు, జె.సాకేత్‌రామ్, కె.ఎస్.ఎన్.రాజు, బి.సంతోష్‌కుమార్, ఎ.బ్రహ్మతేజ, పి.వి.సత్యనారాయణరాజు, కె.అజయ్‌కుమార్, కె.ఎన్.పృథ్వీరాజ్, పి.తేజస్విని.

అరుణాచల్‌ప్రదేశ్ జట్టు : నబమ్‌కామా, తాయ్‌మగూంగ్, త్రేసింగ్ తపేకే (కెప్టెన్), దార్గేబాగ్రా, లిచాజాన్, నబమ్ జోష్, బికి కుమార్, లిఖిసోనియా, హిమాన్షు, దాదూ తచుంగ్, అమర్ జీత్‌శర్మ, రవీంద్రప్రజాపతి, యోర్జుంసెరా, నబమ్ దోల్, మిబోం మోసు, ఆర్యన్ షహాని.





సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

■ 6 నెలల్లో డిగ్రీ: నాగార్జున, ఆంధ్రా యూనివర్సిటీల ద్వారా (L.E), BSC/ B.Com/ BA/ MBA/ MSC. Exams: April 2023. CENTER CODE : 434, శ్రీ వికాష్ కాలేజ్, కడప. 7075407125, 7993090072. [C-781251]

PARAMEDICAL

■ B.Sc Nursing & Paramedical Courses available. DMLT, Anesthesia, Dialysis, Cardiology, Cathlab, Opthalmic: Any Inter Eligible,Tirupati,7416478396, 7416478395. [T-407]

REAL ESTATE

PLOT FOR SALE

■ తిరుపతి ఏర్పేడు IIT,IISER,సిల్క్ డెవలప్ మెంట్ యూనివర్సిటీ,అడిడాస్ షూ కంపెనీ, సోమాని టైల్స్, సోలార్ ప్యానల్స్ కంపెనీలతో వేలాది ఉద్యోగఅవకాశాలు వస్తున్న నేషనల్ హైవేకు ఆనుకొని CC/BT రోడ్స్,ఎలక్ట్రిసిటీ,గేటెడ్ కమ్యూనిటీతో తుడా అప్రూవ్డ్ ప్లాట్లు కలవు. 9848024768. [T-1845]

■ తిరుపతి సమీపంలో తొండవాడ దగ్గర తుడా అప్రూవల్ గల పడమర ముఖం ప్లాటు అమ్మకానికి కలదు. (నో బ్రోకర్స్), సంప్రదించండి: 7601022878. [T-8892]

SERVICES

TOURS & TRAVELS

■ కాకతీయ హాలిడేస్ గంగా పుష్కరాలు గంగోత్రి 7 రోజులు 20 ఏప్రిల్ / గంగా పుష్కరాలు హరిద్వార్ నేపాల్ 12 రోజులు 17 ఏప్రిల్ / గంగా పుష్కరాలు వారణాసి 12 రోజులు14ఏప్రిల్. Ph: 9716179357 [HA-89353]

HEALTH CARE

NEURO

■ డా॥M.సుధాకర్‌రావు M.D(Gold Medalist) D.M. (Neurology) అన్ని రకముల మెదడు, వెన్నుపూస,నరముల జబ్బులు చూడబడును, సుధాకర్ న్యూరో క్యూర్, రెడ్డి & రెడ్డి కాలని, తిరుపతి,0877-2250600,9949916060. [T-8297]

RHEUMATOLOGY

■ డా.పి.దామోదరం,MD,DM(NIMS)రుమటాలిజిస్ట్-కీళ్ళవాతం నిపుణులు,శుభోదయ రుమటాలజి సెంటర్,Opp. SBH Bank, జయనగర్, తిరుపతి,9391344644, 9704582045. [T-387]

HEARING AIDS

■ చెవి లోపల చెవి వెనుక అమర్చుకొను డిజిటల్, ప్రోగ్రామబుల్ హియరింగ్ ఎయిడ్స్ కొరకు సంప్ర: 9849085342. తిరుపతి స్పీచ్ & హియరింగ్ సెంటర్, [illegible] [T-215]

మొలల చికిత్స

■ లూటీ పుండు (FISTULA) మొలలు (PILES) ఫిజర్స్ (FISSURES) ఆధునిక చికిత్స ఆపరేషన్ చేయించుకున్న నయంగాని కేసులు కూడా గ్యారంటిగా చికిత్స చేయబడును. స్త్రీ మూల వ్యాధికి స్త్రీలచేతనే చికిత్స చేయబడును. సంప్ర : 9866969961, 9160647934. [C-789465]

RHEUMATOLOGIST

■ కర్నూలు, కడప, అనంతపురం జిల్లాలో మొట్టమొదటి ఏకైక కీళ్ళవ్యాధి నిపుణురాలు. డాక్టర్. ఎ.స్పజన, M.D., DM., NIMS (Hyd) ప్రత్యేకతలు : చేతులు, మణికట్టు, కీళ్ళలో నొప్పి, వాపు రావడం, ప్రొద్దున్నే లేవగానే నడవలేకపోవడం పాదాలు వాపులు రావడం అరికాళ్ళ మంటలు, పుండ్లు, నొప్పులు రావడం వెన్ను మెడ వంగడం, కాళ్ళ బొటనవేళ్ళపై పుండ్లు రావడం, వెన్నుపూస వంగిపోవడం, మోకాళ్ళు అరిగిపోవడం, నోటిలో యర్రపుండ్లు రావడం, చిన్నపిల్లల కీళ్ళధులకు చూడబడును. క్లినిక్ జీవన్ రాయలసీమ సూపర్ స్పెషాలిటీ, గవర్నమెంట్ హాస్పిటల్ ఎదురుగా, కలెక్టర్ ఆఫీస్, కర్నూలు. 08518-255502, సెల్ : 81064 60012 [L-793211]

WANTED

■ MNC కంపెనీ బెంగుళూరులో పనిచేయుటకు బాయ్స్ & గర్ల్స్ కావలెను. అర్హత: 10th, ఇంటర్, డిగ్రీ, డిప్లొమో, రూమ్+ఫుడ్+జీతం: 15500-23000, సంప్ర :9901972313, 8088555585. [C-1143121]

■ Lady Teacher required for Little Millennium Pre School, Kadapa. Qualification: Degree. Contact: 86886 34652. English speaking is mandatory. [C-781252]

■ కడప జిల్లాలో డ్రైఫ్రూట్, మసాలాలు సేల్ చేయుటకు మార్కెటింగ్, ఎగ్జిక్యూటివ్స్ (M), సూపర్ మార్కెట్‌లో పనిచేయుటకు(F) కావలెను. Sal: 8-15 +ఇన్సెంటివ్, Age: 35 సం॥ లోపల, Qul: 10th, Ph: 9059966777, 7416761359. Every Saturday. [C-789499]

■ ప్రొద్దుటూరు పట్టణంలో గ్యాస్ కంపెనీలో పనిచేయుటకు System Operator, ఫీల్డ్ మరియు టెలికాలర్స్ కావలెను. 9080057777, 9246395566. [C-789437]

■ మా సంస్థ నందు Delivery Executive గా వర్క్ చేయుటకు ఆసక్తిగల అభ్యర్థులు కావలెను. ఆదాయం రోజుకు 1500+ ఆపైన ✆ 7075111363, 9346457282 [G-776233]

■ ఇంటి దగ్గర ఉండి మా కంపెనీ బల్బులు ఫిట్ చేసి ఇవ్వడం ద్వారా నెలకి 15,000 నుంచి 20,000 వరకు జీతం. మరిన్ని వివరాలకై సంప్ర:7815811791 [G-776234]

■ ప్రముఖ డిటర్జెంట్ కంపెనీకి ఏరియా వారిగా డిస్ట్రిబ్యూటర్స్ మరియు అనుభవం కలిగిన సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. సంప్ర॥ 7729991156, 9848005286 [Y-1052631]

■ ప్రముఖ సంస్థ నందు మీ ఇంటిదగ్గర ఉంటూ పార్ట్ టైం/ఫుల్ టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. నెలకు 10-15వేలు వరకు సంపాదన. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586 [G-776241]

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారాని ₹3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. 9573633520, 9059633520 [M-1203191]

■ Urgent Requirement For A Reputed Company (NUZ CAREER) General Workers, Welders, Plumber, Electrician, Mason, Painters, Packing Hotel / Hospital Cooks, Kitchen Helper's, Cleaners, Waiter's, Delivery Boys, Light & Heavy Drivers, Nurses, Housemaids, Both Male & Female Workers, 10th pass / Fail. Ph : 78010 72347 [V- 6022]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని విశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడ మైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.



జ్యోతిష్య రంగంలో తిరుగులేని సురేష్‌బాబు

కడప కల్చరల్ : జిల్లా జ్యోతిష్య రంగంలో సుపరిచితమైన పేరు సురేష్‌బాబు. 22 ఏళ్లుగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల్లో జ్యోతిష్య పండితుడిగా సుపరిచితుడైన ఈయన ఆస్ట్రాలజీలోని పలు అంశాలపై పరిశోధనలు చేసి పట్టు సాధించారు. రెండు తెలుగు రాష్ట్రాలలో ఇతర దక్షిణాది రాష్ట్రాలకు చెందిన పలువురు రాజకీయ నాయకులు, పారిశ్రామికవేత్తలు, సినీరంగ ప్రముఖులు సైతం ఆయన జ్యోతిష్యం పట్ల అపార విశ్వాసం కలిగి ఉండటం విశేషం. ఇప్పటి వరకూ ఆయన 20 వేల మందికి పైగా జ్యోతిష్యం చెప్పి విజయ పథంలో నడిపించారు. సురేష్‌బాబు జన్మించిన జనవరి 1వ తేదీనే తన కుమారుడు కూడా జన్మిస్తాడని ముందుగానే జ్యోష్యం చెప్పి అక్షర సత్యం చేయడమే ఇందుకు నిదర్శనం.

మనిషి ఆచరించే ప్రతి కర్మలోనూ జ్యోతిష్యం

పురాతన కాలం నుంచి నేటి వరకు నిలిచి ఉన్న విజ్ఞానశాస్త్రమే జ్యోతిష్యం. భారతీయ జీవనమంతా జ్యోతిష్యంతో ముడిపడి ఉంది. మనిషి ఆచరించే ప్రతి కర్మలోనూ, నిత్య విధుల్లోనూ వారికే తెలియని జ్యోతిష్య అంశాలున్నాయి.

– ముద్దల సురేష్‌బాబు, ఎంఏ(ఆస్ట్రాలజీ), కడప.































జిల్లా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు

కడప కార్పొరేషన్ : కోటి ఆశలతో కొత్త సంవత్సరంలో అడుగిడుతున్న జిల్లా ప్రజలకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాషా ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. కొత్త సంవత్సరంలో ప్రతి ఒక్కరూ సుఖ సంతోషాలతో, ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు. ప్రజల కోరికలు, ఆకాంక్షలు ఫలప్రదం కావాలని కోరారు.



కమలాపురం : నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. 2023వ సంవత్సరం నియోజకవర్గ ప్రజల జీవితాల్లో సుఖ సంతోషాలు నింపాలన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2023లో మరిన్ని సేవలు అందించి ప్రజల నుంచి ప్రశంసలు అందుకుంటారని తెలిపారు.

నూతన సంవత్సరానికి ఘనస్వాగతం

కమలాపురం : మండల ప్రజలు నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించు కున్నారు. ముఖ్యంగా శనివారం అర్ధరాత్రి 12 గంటలు కాగానే యువకులు బాణా సంచా పేల్చి నూతన సంవత్సరానికి ఘనంగా స్వాగతం పలికారు. కేక్‌లు కట్ చేసి పంచి పెట్టారు. మండలంలో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా సీఐ సత్యబాబు పర్యవేక్షణలో ఎస్‌ఐ చిన్నపెద్దయ్య సిబ్బందితో కలసి బందోబస్తు నిర్వహించారు.

సెర్ప్ సిబ్బంది పాత్ర కీలకం

కలెక్టర్ విజయ్ రామరాజు



జిల్లా కలెక్టర్ విజయ్ రామరాజుతో సెర్ప్ సిబ్బంది

కడప కార్పొరేషన్ : రాష్ట్ర ప్రభుత్వం నవరత్నాల రూపంలో అందిస్తున్న సంక్షేమ పథకాలను పేదలకు అందించడంలో సెర్ప్ సిబ్బంది అందిస్తున్న పాత్ర చాలా ప్రాముఖ్యమైనదని జిల్లా కలెక్టర్ విజయ్ రామరాజు అన్నారు. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఏర్పడి 20 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా శుక్రవారం రాత్రి కలెక్టర్ చేతుల మీదుగా కేక్ కట్ చేయించారు. సెర్ప్ సిబ్బందికి కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నగరపాలక కమిషనర్ ఎస్ఎస్ ప్రవీణ్‌చంద్, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

కొత్త సంవత్సరంలో ఉత్సాహంగా పనిచేయాలి



వార్డు సచివాలయ ఉద్యోగులతో మాట్లాడుతున్న కమిషనర్ ప్రవీణ్‌చంద్

కడప కార్పొరేషన్ : వార్డు సచివాలయ ఉద్యోగులు నూతన సంవత్సరంలో ఉత్సాహంగా పనిచేసి ప్రజలకు సేవలందించాలని మున్సిపల్ కమిషనర్ ఎస్ఎస్ ప్రవీణ్‌చంద్ అన్నారు. శనివారం మధ్యాహ్నం ఆయన 35/1, 35/2 వార్డు సచివాలయాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సెక్రటరీలంతా యూనిఫారం తప్పక ధరించాలన్నారు. పింఛన్ల వెరిఫికేషన్ సాయంత్రానికల్లా పూర్తి చేయాలన్నారు. ప్రజలకు సేవ చేయడమే పరమావధిగా ఉండాలని, గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సీఐటీయూ నూతన కమిటీ ఎన్నిక



కామనూరు శ్రీనివాసులు రెడ్డి, జిల్లా అధ్యక్షుడు



బెల్లం మనోహర్ జిల్లా ప్రధాన కార్యదర్శి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : సీఐటీయూ నూతన జిల్లా కమిటీని ఎన్నుకున్నట్లు సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కామనూరు శ్రీనివాసులు రెడ్డి పేర్కొన్నారు. శనివారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ నూతన కమిటీని ఎన్నుకున్నామన్నారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడిగా శ్రీనివాసులు రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి బెల్లం మనోహర్ తో పాటు 50 మంది జిల్లా కమిటీగా, 11 మందితో ఆఫీస్ బేరర్స్‌తో కమిటీని ఎన్నుకున్నామన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి సమర శీల పోరాటాలు చేపడతామన్నారు. సీఐటీయూ నాయకులు లక్ష్మీదేవి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న వైవీయూ రిజిస్ట్రార్ ఆచార్య వై.పి.వెంకటసుబ్బయ్య

వైవీయూ : క్రీడల్లో రాణించడం ద్వారా ఉజ్వల భవిష్యత్తును సొంతం చేసుకోవచ్చని యోగివేమన విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య పేర్కొన్నారు. శనివారం వైవీయూలోని వేమన ప్లేఫీల్డ్స్‌లో అంతర్ కళాశాలల ఖోఖో మెన్ అండ్ ఉమెన్ పోటీలు, ఎంపికలు నిర్వహించారు. ఈ పోటీలను రిజిస్ట్రార్ పూజా కార్యక్రమాలు నిర్వహించి ప్రారంభించారు. వైవీయూ క్రీడాబోర్డు కార్యదర్శి డాక్టర్ కె. రామసుబ్బారెడ్డి, జాతీయస్థాయి ఖోఖో క్రీడాకారుడు, టోర్నమెంట్ పరిశీలకుడు కాశీవిశ్వనాథ్‌రెడ్డి , ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఆచార్య టి. శ్రీనివాస్, ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి పాల్గొన్నారు.

మత్తు పదార్థాలను నిషేధించాలి

వైవీయూ: రాష్ట్రంలో గుట్కా, పాన్, మద్యపానం, డ్రగ్స్‌ను నిషేధించాలని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ జిల్లా కన్వీనర్ మంజునాథరెడ్డి డిమాండ్ చేశారు. శనివారం కడప నగరంలోని డా. బి.ఆర్. అంబేద్కర్ సర్కిల్‌లో వారు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు.

124 నూతన పెన్షన్లు మంజూరు

వల్లూరు : మండలానికి 124 నూతన పెన్షన్లు మంజూరైనట్లు ఎంపీడీఓ జుబేద ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో మొత్తం 9 గ్రామ సచివాలయాలు వుండగా దిగువ పల్లెకు 8, దుగ్గాయపల్లెకు 13, కొప్పోలుకు 5, లేబాకకు 6, పైడికాలువకు 19, తోల్ల గంగనపల్లెకు 16, తప్పెట్లకు 15, కోట్లూరుకు 10, వల్లూరుకు 32 నూతన పెన్షన్‌లు మంజూరైనట్లు ఆమె తెలిపారు. జనవరి మొదటి వారంలో వారికి పెన్షన్‌తో పాటు పత్రాలను అందజేస్తామన్నారు.

వేమన జయంతి రాష్ట్రవేడుకగా జరపడం శుభసూచకం

వైవీయూ : యోగివేమన జయంతిని ఏటా జనవరి 19న అధికారికంగా నిర్వహించాలంటూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేయడం శుభసూచకమని ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం కడప జిల్లా అధ్యక్షులు ఆచార్య ఎస్. ఈశ్వరరెడ్డి పేర్కొన్నారు. గొప్ప మానవతావాది, సామాజికవేత్త, సంస్కరణకారుడు, విప్లవకవి అయిన వేమన జయంతిని ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించతలపెట్టడం ఆహ్వానించదగ్గ పరిణామమన్నారు. రాయలసీమ చరిత్ర, సంస్కృతి భాషల నేపథ్యంలో వేమన కవిత్వ ప్రాధాన్యాన్ని ప్రపంచానికి తెలియజెప్పాలని పేర్కొన్నారు.































ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి



జాబ్‌మేళా పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి తదితరులు

- 6న కమలాపురంలో జాబ్‌మేళా
- పోస్టర్లను ఆవిష్కరించిన ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

కడప కోటిరెడ్డిసర్కిల్ : నిరుద్యోగ యువత అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. శనివారం కడప నగరంలోని ఎమ్మెల్యే స్వగృహంలో జాబ్‌మేళాకు సంబంధించిన పోస్టర్లను ఆయన అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కమలాపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జరిగే ఈ జాబ్‌మేళాను ఏపీ రాష్ట్ర నైపుణాభివృద్ధి సంస్థ, సీ డ్యాప్, ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్ సంయుక్తాధ్వర్యంలో నిర్వహిస్తున్నారని తెలిపారు. కమలాపురంలో జరగనున్న ఈ జాబ్‌మేళాకు కియా మోటార్స్ ఇండియా, షిర్డి సాయి ఎలక్ట్రికల్స్, మెడ్ ప్లస్, అపోలో ఫార్మసీ, గ్రీన్ టెక్ ఇండస్ట్రీస్, హ్యూన్ డై మొబీస్ తదితర కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారన్నారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, పీజీ, డిప్లొమా అభ్యర్థులు ఇంటర్వ్యూకు అర్హులన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు గుమ్మా రాజేంద్రనాథ్‌రెడ్డి, పులి సునీల్ కుమార్, డీఆర్‌డీఏకు చెందిన పృథ్వీతేజ్ తదితరులు పాల్గొన్నారు.

కమర్షియల్ బ్యాంకులకు దీటుగా డీసీసీబీ సేవలు



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న డీసీసీబీ చైర్‌పర్సన్ మల్లెల ఝాన్సీ, ఎమ్మెల్యే రవీంద్రనాథ రెడ్డి,సీఈఓ

కడప అగ్రికల్చర్: కమర్షియల్ బ్యాంకులకు దీటుగా డీసీసీ బ్యాంకు కూడా అన్ని వర్గాల వారికి తక్కువ వడ్డీతో రుణాలను అందించి వారి అభివృద్ధికి కృషి చేస్తోందని కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథ రెడ్డి, ఆప్కాబ్, డీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ మల్లెల ఝాన్సీరాణి పేర్కొన్నారు. శనివారం కడప డీసీసీ బ్యాంకు సమావేశ మందిరంలో డీసీసీ బ్యాంకుకు సంబంధించిన 2023– నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్‌ను బ్యాంక్ సీఈఓ రాజేంద్రకుమార్ అధ్యక్షతన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రవీంద్రనాథ రెడ్డి, బ్యాంకు చైర్మెన్, డైరెక్టర్, సీఈఓలతోపాటు బ్యాంకు సిబ్బందికి నూతన సంవత్సర శుభాకాంక్షలను తెలియచేశారు. ఆప్కాబ్ చైర్ పర్సన్ మల్లెల ఝాన్సీరాణి మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహకారంతో నష్టాల బాటలో ఉన్న డీసీసీ బ్యాంకును నేడు లాభాల బాటలోకి తెచ్చామన్నారు. బ్యాంకు సీఈఓ రాజేంద్రకుమార్ మాట్లాడుతూ అందరి సహకారంతో బ్యాంకును అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తున్నామన్నారు.

టైలరింగ్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

డిప్యూటీ మేయర్ ముంతాజ్ బేగం



ఉచిత టైలరింగ్ శిక్షణను ప్రారంభిస్తున్న డిప్యూటీ మేయర్ ముంతాజ్ బేగం

కడప కార్పొరేషన్: నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో గాయత్రీ స్వయం సహాయ సంఘం నిర్వహిస్తున్న ఉచిత టైలరింగ్ శిక్షణను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ మేయర్ ముంతాజ్ బేగం అన్నారు. శనివారం అక్కాయపల్లెలో ఉచిత టైలరింగ్‌ను ఆమె ప్రారంభించి మాట్లాడారు. ఇక్కడ శిక్షణ పొందిన మహిళలు సొంతంగా టైలరింగ్ షాపులు పెట్టి ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. నెహ్రూ యువకేంద్ర జిల్లా అధికారి మణికంఠ మాట్లాడుతూ 45 రోజులు పాటు శిక్షణ జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకుడు గోవిందు నాగరాజు, వైఎస్సార్‌సీపీ నగర మహిళా అధ్యక్షురాలు టీపీ వెంకట సుబ్బమ్మ, మూలే సరస్వతి, బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బి. లింగమూర్తి, మాజీ కార్పొరేటర్ జిలానీ బాషా, నారాయణమ్మ పాల్గొన్నారు.

తైక్వాండో పోటీల్లో నగర క్రీడాకారుల ప్రతిభ



క్రీడాకారులను అభినందిస్తున్న అఫ్జల్‌ఖాన్

కడప స్పోర్ట్స్: స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో కడప నగరానికి చెందిన క్రీడాకారులు చక్కటి ప్రతిభ కనబరిచారు. ఇటీవల నంద్యాల జిల్లా ఆళ్లగడ్డలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో నగరానికి చెందిన ఎస్. హలీమ సాదియ గోల్డ్‌మెడల్, జెస్సికాషారూన్ రజతం, అఫ్జల్‌బాషా రజతం సాధించారు. వీరిని వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి టి.కె. అఫ్జల్‌ఖాన్ అభినందించారు. జిల్లా ఖ్యాతిని మరింత చాటిచెప్పాలని ఆకాంక్షించారు. తైక్వాండో శిక్షకుడు జంషీర్‌బాషా, నరసింహ పాల్గొన్నారు.

నూతన దర్శనాలకు ఏర్పాట్లు



దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రధాన ద్వారం

కడప కల్చరల్ : నూతన సంవత్సరం సందర్భంగా పలువురు దేవాలయాలకు వెళ్లి దేవతామూర్తులను దర్శించుకోవడం పరిపాటి. ఈ సందర్భానికి తగినట్లు దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయాన్ని సిద్ధం చేశారు. సోమవారం వైకుంఠ ఏకాదశి కారణంగా భక్తులు భారీ సంఖ్యలో వచ్చే అవకాశం ఉండడంతో ఈ రెండు రోజులపాటు భక్తుల దర్శనాలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టారు. ఉత్తరం వైపు వైకుంఠ దర్శనానికి ఇప్పటికే బారికేడ్లతో క్యూలైన్లను ఏర్పాటు చేశారు. ఆవైపు వచ్చి ఉత్తర ద్వార దర్శనం చేసుకునే వారికి ఆహ్వానం పలుకుతూ భారీ స్వాగత తోరణాలు ఏర్పాటు చేశారు. ఉదయం 5.00 గంటల నుంచి భక్తులను దర్శనాలకు అనుమతించనున్నారు. ప్రధాన ద్వారం నుంచి వెళ్లే భక్తులకు అక్కడే రూ. 10 సాధారణ దర్శన టిక్కెట్, రూ. 25 స్పెషల్ దర్శన టిక్కెట్లుపై పంపనున్నారు.

డిజిటల్ లైబ్రరీని సద్వినియోగం చేసుకోవాలి

చెన్నూరు : గ్రామాల్లోని అన్ని వర్గాల ప్రజలు టెక్నాలజీ పరంగా ముందుకు వెళ్లాలని వైఎస్సార్ డిజిటల్ లైబ్రరీలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారని ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన మండలంలోని బలసింగాయపల్లె గ్రామ పంచాయతీలోని కనపర్తి గ్రామంలో నూతనంగా నిర్మించిన వైఎస్సార్ డిజిటల్ లైబ్రరీని ప్రారంభించి మాట్లాడారు. ఉమెన్ సెల్ఫ్ హెల్ప్ గ్రూపు ఫెడరేషన్ బిల్డింగ్ వైఎస్సార్ డిజిటల్ లైబ్రరీని అధునాతనంగా అన్ని వసతులతో నిర్మించడం జరిగిందన్నారు. గ్రామప్రజలు వైఎస్సార్ డిజిటల్ లైబ్రరీ సేవలు ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జీఎన్ భాస్కర్‌రెడ్డి, ఎంపీపీ చీర్ల సురేష్ బాబు, జెడ్పీటీసీ ముదిరెడ్డి దిలీప్‌రెడ్డి, ఎంపీటీసీ పెనుమూరు రఘురామిరెడ్డి, పల్లె కృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్ కృష్ణారెడ్డి, ముదిరెడ్డి సుబ్బారెడ్డి, సర్పంచులు నారాయణమ్మ, సొంటం నారాయణరెడ్డి, తుంగ చంద్రశేఖర్ యాదవ్, సిద్దిగారి వెంకటసుబ్బయ్య, మండల ఉపాధ్యక్షుడు ఆర్ఎస్ఆర్, ఎర్రసాని మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

మాజీ సైనికుల సంక్షేమసంఘం క్యాలండర్ ఆవిష్కరణ

వైవీయూ : వైఎస్ఆర్ కడప జిల్లా మాజీ సైనికుల సంక్షేమ సంఘం 2023 క్యాలండర్‌ను జిల్లా రెవిన్యూ అధికారి జి. గంగాధర్‌గౌడ్ ఆవిష్కరించారు. శనివారం కడప కలెక్టరేట్‌లో ఆయన జిల్లా మాజీ సైనికుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు పి. లక్ష్మినారాయణ ఆధ్వర్యంలో రూపొందించిన క్యాలండర్‌ను ఆవిష్కరించారు.

హ్యాపీ న్యూ ఇయర్..!

- కట్టలు తెగిన సంబరం
- శుభాకాంక్షల కోలాహలం
- రోడ్లపై యువత హల్‌చల్



వైవీ స్ట్రీట్‌లో జనాల రద్దీ

కడప కల్చరల్ : క్షణ క్షణం ఉద్వేగం....అందరూ సెల్‌ఫోన్లలోనూ.... రిస్ట్‌వాచ్‌లకేసి చూస్తున్నారు. శనివారం అర్ధరాత్రి...టిక్...టిక్...టిక్...కౌంట్ డౌన్ మొదలైంది. అంతటా ఆతృత... ...11.57...11.58...11.59....ఆ తర్వాత ఎదురుచూసిన క్షణం రానేవచ్చింది. రాత్రి సరిగ్గా 12.00 గంటలు...ఒక్కసారిగా దిక్కులు పిక్కటిల్లేలా యువత కేరింతలు. ఒకరినొకరు హత్తుకుని హ్యాపీ న్యూ ఇయర్ అంటూ పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కేరింతలతో బైకులపై విన్యాసాలు చేస్తూ వీధుల్లో కలియతిరిగారు. కనిపించిన వారందరికీ శుభాకాంక్షలు తెలిపారు. పోలీసుల పటిష్ట బందోబస్తుతో పాటు ఆంక్షలు ఎక్కువగా ఉండడంతో యువత జోష్ ఈసారి కొద్దిమేర తగ్గినట్లు కనిపించింది. అంతకుముందు సాయంత్రం పలు కేకు దుకాణాల వద్ద రద్దీ కనిపించింది. రోడ్లు జనాలతో నిండిపోయాయి.

సందడే సందడి

కడప నగరంలో శనివారం అర్ధరాత్రి నూతన సంవత్సరం సంబరాలు అంబరాన్ని అంటాయి. అర్ధరాత్రి 12 గంటలకు ప్రజలంతా ఆనందంతో నూతన సంవత్సరాన్ని స్వాగతిస్తూ పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. రాత్రి 12 గంటలకు కొందరు ఉత్సాహంగా టపాసులు కాల్చి సంబరపడ్డారు. మరికొందరు కేకులు కట్ చేసి స్వీట్లు ఒకరినొకరు తినిపించుకున్నారు. దాదాపు అన్ని చర్చిలలో నూతన సంవత్సరాన్ని ఆహ్వానిస్తూ శనివారం అర్ధరాత్రి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఆయా చర్చిల పాస్టర్లు, ఇతర పెద్దలు నూతన సంవత్సర ఆధ్యాత్మిక సందేశం, ఆశీస్సులు అందజేశారు.





పార్లమెంట్‌ చట్టాన్ని అపహాస్యం చేస్తున్న కేంద్రం

కడప వైఎస్‌ఆర్‌ సర్కిల్‌ : రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తామని చెప్పి పార్లమెంట్‌లో చట్టం చేసి అమలు చేయకుండా బీజేపీ ప్రభుత్వం అపహాస్యం చేస్తోందని సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌ పేర్కొన్నారు. శనివారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ దేశంలో సమతుల్య సమాజాన్ని సాధించేందుకు రాజ్యాంగం పెట్టిన రిజర్వేషన్లు నిర్వీర్యం చేస్తోందని మండిపడ్డారు. మోదీ ప్రభుత్వం ఏపీకి రాజధాని లేని పరిస్థితి తీసుకువచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నగర కార్యదర్శి రామ్మోహన్‌, నగర కమిటీ సభ్యుడు చంద్రారెడ్డి, ఓబులేసు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు చలికోట్లు పంపిణీ



కడప కార్పొరేషన్‌: కడప నగరం 30వ డివిజన్‌లోని పారిశుధ్య కార్మికులకు ఆ డివిజన్‌ కార్పొరేటర్‌ ఎస్‌ఎండీ షఫీ చలికోట్లు పంపిణీ చేశారు. స్థానిక వార్డు సచివాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కార్మికులు చలికి ఇబ్బంది పడకుండా ప్రభుత్వం చలికోట్లు పంపిణీ చేయడం శుభ పరిణామమన్నారు.

పచ్చని మొక్కతో శుభాకాంక్షలు తెలుపుదాం



ఏడు రోడ్ల కూడలిలో మొక్కలతో అవగాహన కల్పిస్తున్న జేవీవీ నాయకులు



మాట్లాడుతున్న కేఎస్‌ఆర్‌ఎం కళాశాల కోశాధికారి కందుల రాజేశ్వరమ్మ

కడప ఎడ్యుకేషన్‌: నూతన సంవత్సర శుభాకాంక్షలను ఈ ఏడాది నూతనంగా పచ్చని మొక్కతో తెలుపుకుందామని జనవిజ్ఞాన వేదిక జాతీయ ఉపాధ్యక్షులు విశ్వనాథ్‌, జాతీయ సమాచార కార్యదర్శి, రాష్ట్ర కోశాధికారి సనావుల్లాలు తెలిపా రు. నూతన సంవత్సర శుభాకాంక్షలు పచ్చని మొక్కతోనే తెలుపుకుందా అంటూ శనివారం వారు కడపలోని ఏడు రోడ్ల కూడలి, కలెక్టరేట్‌ వద్ద ''ప్రాణం లేని బొకే వద్దు.. ప్రాణం ఉన్న మొక్కే ముద్దు'' అంటే అవగాహన కార్యక్రమంతోపాటు ర్యాలీని నిర్వహించారు. కడప జిల్లా జనవిజ్ఞాన వేదిక నాయకులు మల్లికార్జున, ఎస్‌ఎండీ ఇలియాస్‌బాషా, మల్లికార్జున, శంకరయ్య, రాజాబాష, వాజిద్‌, కరీముల్లా పాల్గొన్నారు.

కేఎస్‌ఆర్‌ఎంలో..

కడప నగర శివార్లలోని కేఎస్‌ఆర్‌ఎం ఇంజనీరింగ్‌ కళాశాలలో శనివారం సూ క్లబ్‌, కల్చరల్‌ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో కళాశాల ఓపెన్‌ ఆడిటోరియంలో న్యూ ఇయర్‌ సెలబ్రేషన్స్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల కోశాధికారి కందుల రాజేశ్వరమ్మ మాట్లాడుతూ కొత్త సంవత్సరం మీ అందరికి ఆత్మస్థైర్యం, ఆనందం, శక్తితో నిండిన సంవత్సరం కావాలని కోరుతూ అందరికీ శుభాకాంక్షలు తెలియచేశారు. కళాశాల ప్రధానాచార్యులు వీఎస్‌ఎస్‌మూర్తి పాల్గొన్నారు

విద్యాభివృద్ధికి సీఎం ప్రత్యేక శ్రద్ధ

పులివెందుల టౌన్‌ : విద్యాభివృద్ధికోసం ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చొరవతీసుకుంటున్నారని మున్సిపల్‌ ఇన్‌చార్జి వైఎస్‌ మనోహర్‌రెడ్డి అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ బాలికల డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్‌ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఫ్రెషర్స్‌డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పులివెందులలో ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల కావాలని అడిగిన వెంటనే మంజూరు చేసి ఏడాదిలోనే అందుబాటులోకి తెచ్చారన్నారు. అనంతరం విద్యార్థినులు చేసిన నవరత్నాలు నాటక ప్రదర్శన అందరిని ఆకట్టుకుంది. కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్‌ లింగాల ఉషారాణి, మున్సిపల్‌ చైర్మన్‌ వరప్రసాద్‌, మార్కెట్‌ యార్డు చైర్మన్‌ చిన్నప్ప, మున్సిపల్‌ వైస్‌ చైర్మన్‌ హాఫీజ్‌, ఎంఈఓ వీరారెడ్డి, ప్రభుత్వ బాలికల జూనియర్‌ కళాశాల ప్రిన్సిపాల్‌ వెంకటసుబ్బయ్య, ప్రొఫెసర్‌ డాక్టర్‌ బాలనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బైరీ నరేష్‌పై కఠిన చర్యలు తీసుకోవాలి



కమలాపురంలో ర్యాలీగా వెళ్తున్న అయ్యప్ప భక్తులు

కమలాపురం : అయ్యప్పస్వామిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బైరి నరేష్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని అయ్యప్పస్వామి ఆలయ గురుస్వామి నరసింహారెడ్డి తెలిపారు. శనివారం అయ్యప్పస్వామిపై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు నిరసనగా గ్రామ చావడి నుంచి పోలీస్‌ స్టేషన్‌ వరకు అయ్యప్ప భక్తులు ర్యాలీ నిర్వహించి ఎస్‌ఐకు వినతిపత్రం అందజేశారు. హిందువుల మనోభావాలను దెబ్బతీస్తూ అయ్యప్ప పుట్టుకను అవమానిస్తూ అనుచిత వ్యాఖ్యలు చేసిన బైరి నరేష్‌పై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్‌ చేశారు.

వేంపల్లె : అయ్యప్ప భక్తులు శనివారం స్థానిక పోలీస్‌ స్టేషన్‌లో బైరి నరేష్‌ చేసిన వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాలని వేంపల్లె సీఐ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆర్‌కే వ్యాలీ ఎస్‌ఐ రంగరావుకు ట్రిపుల్‌ ఐటీలో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులు, అయ్యప్ప భక్తులు వినతిపత్రం అందించారు.

జమ్మలమడుగు : అయ్యప్పస్వామిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన నరేష్‌ను కఠినంగా శిక్షించాలంటూ అయ్యప్పస్వాములు శనివారం గురుస్వామి భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి ఆర్డీఓ జి.శ్రీనివాసులుకు వినతిపత్రం అంజేశారు.

ఎర్రగుంట్ల : అయ్యప్పస్వామిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన నరేష్‌ను కఠినంగా శిక్షించాలంటూ పట్టణంలోని హిందువులు నాలుగురోడ్ల కూడలిలో నిరసన వ్యక్తం చేసి అనంతరం సీఐ మంజునాథ్‌రెడ్డికి, తహసీల్దార్‌ ఎ .నాగేశ్వరరావుకు విశ్వహిందూ పరిషత్‌ సభ్యులు, అయ్యప్పస్వామి భక్తులు వినతిపత్రం అందజేశారు.

రిమ్స్‌లో గుర్తు తెలియని మహిళ మృతి



కడప అర్బన్‌ : కడప రిమ్స్‌ ఆవరణలో గుర్తు తెలియని మహిళ (50–60) అనారోగ్యంతో మృతి చెందింది. కొంతకాలంగా రిమ్స్‌ ఆవరణలో ఉండగా అస్వస్థతకు గురి కావడంతో శనివారం అత్యవసర విభాగంలో చేర్పించి వైద్య సేవలందించారు. ఆమె ఆచూకీ తెలిసిన వారు, బంధువులు ఎవరైనా ఉంటే తమను సంప్రదించాలని కడప రిమ్స్‌ ఔట్‌ పోస్టు పోలీసులు తమ ఫోన్‌ నెం- 95025 06369లో సంప్రదించాలని కోరారు. ఈ మేరకు రిమ్స్‌ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధురాలు మృతి

ముద్దనూరు : మండలంలోని కోడిగాండ్లపల్లె గ్రామానికి చెందిన రాయపాటి గంగమ్మ(65)ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. ఏఎస్‌ఐ ఆంజనేయులు కథనం మేరకు.. డిసెంబరు 26వ తేదీన కోడిగాండ్లపల్లెలో గంగమ్మ మందుల కోసం 104 వాహనం వద్దకు వెళ్తుండగా దేవర దున్నపోతు ఆమెను పొడవడంతో తీవ్రగాయాలపాలైంది. ఆమెను కడప రిమ్స్‌కు తరలించారు. కుమారుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

2023 - ఆకాంక్షలు



ప్రతి కుటుంబం వర్ధిల్లు గాక!

కాలం చల్లటి నీడనిచ్చే చెట్టు కావాలి. వడగాడ్పు నుంచి, ఊపి కొట్టే వాన నుంచి, గడ్డ కట్టే చలి నుంచి అది మనుషులను కాయాలి. పంటలు సమృద్ధిగా పండాలి. తియ్యటి మామిడిపండ్లు బండ్ల కొద్దీ మండీలకు చేరాలి. పూలు సలీసుగా దొరకాలి. కొలనుల్లో చేపల వీపులను తామరతూడులు తడమాలి. నదులు ఒండ్రుమట్టిని ఒడ్డుకు తోస్తూ ప్రవహించాలి. సముద్రాలు శాంత వచనాలు పలకాలి. మహమ్మారులు తోకలు ముడవాలి. ఒకటీ అరా మాత్రలతో తగ్గిపోయే రోగాలే చలామణిలో ఉండాలి. నాలుగు గోడలు లేపినవాడు పైకప్పు వేసుకోగలగాలి. గూడే లేని వాడు ఇంత జాగా సంపాదించుకోవాలి. ఉద్యోగాలు ఇబ్బడి ముబ్బడిగా చేతికందాలి. కాయకష్టం చేసేవాడు బువ్వకు లోటెరగక ఉండాలి. పాలకులు పెద్ద మనసు చేసుకోవాలి. కట్నాలు, లాంఛనాల జంజాటాలు లేక అప్పుల బెంగ ఎరగని పెళ్ళిళ్లు జరగాలి. ఆడపిల్లలు సగౌరవంగా, సురక్షితంగా ఉండాలి. స్త్రీల గెలుపు గాథలు వినిపించాలి. యువతీ యువకుల సబబైన ఇష్టాలు చెల్లుబాటు కావాలి. రహదారులు క్షేమమార్గాలుగా విలసిల్లాలి. సమాజం శాంతితో నిండాలి. అశాంతి కొరకు ప్రయత్నించే ప్రతి చర్యా చతికిలపడాలి. హేతువుకు చోటు దక్కాలి.

ప్రతి ఇల్లు పాలు తేనెల సమృద్ధితో నిండాలి. తాతయ్య, నానమ్మలు కులాసాగా ఉండాలి. అమ్మ చెప్పినట్టు అందరూ వినాలి. నాన్న జేబు ఎప్పుడూ నిండుగా ఉండాలి. పిల్లలు సదా పకపకలాడాలి. చదువులెన్నో బుద్ధిగా చదవాలి. బంధువులందరూ బలగంగా ఉండాలి. స్నేహితులందరూ శక్తిగా మారాలి. కొత్త సంవత్సరం అందరికీ శుభాలు తేవాలి. ప్రతి కుటుంబం వర్ధిల్లాలి.

మంచిని తలుద్దాం. విశ్వం వింటుంది.
గట్టిగా అనుకుందాం. తప్పక నెరవేరుతుంది.
హ్యాపీ న్యూ ఇయర్.





* ఎంపిక

న్యూ ఇయర్ గిఫ్ట్



న్యూ ఇయర్ సందర్భంగా ఆత్మీయులకు కానుకలు ఇచ్చి ఆనందాన్ని పంచుకోవాలనుకుంటారు. అందుకు ఖరీదైన కానుకలనే ఎంచుకోనక్కర్లేదు. మీరిచ్చే బహుమతి ఆశ్చర్యాన్ని కలిగించనక్కర్లేదు. సానుకూలమైన ఆలోచనలు కలిగించేవిగా ఉంటే చాలు. కొన్ని నెలల తర్వాత చెత్తబుట్టలో పడేసే వాటిని ఇచ్చే బదులు తక్కువ ఖర్చుతో పర్యావరణ స్నేహపూర్వక కానుకలను ఇస్తే అన్ని చోట్లా ఆనందం రెట్టింపు అవుతుంది.

పెయింట్ వేసిన కుండీలు

ఇండోర్ లేదా అవుట్ డోర్‌లలో అందమైన పెయింట్ చేసిన మొక్కల కుండీలను కూడా అలంకరణకు వాడుతుంటారు. స్వయంగా పెయింట్ చేసిన కుండీలను కూడా కానుకకు ఎంపిక చేసుకోవచ్చు.



పచ్చని కానుక

మొక్కలను ప్రేమించనివారుండరు. అవి ఇండోర్ లేదా అవుట్ డోర్ కావచ్చు. గృహాలంకరణలోనూ మొక్కలకు కొంత ప్లేస్‌ను కేటాయిస్తుంటారు. ఇలాంటి అభిరుచి గలవారికి చిన్న చిన్న మొక్కలు ఉన్న కుండీలను కానుకగా ఇవ్వచ్చు. విత్తన ప్యాకెట్లను ఎంపిక చేసి ఇవ్వచ్చు. స్థానికంగా ఉన్న నర్సరీలో మొక్కల కొనుగోలుకు కొంత మొత్తం చెల్లించి, ఆ రసీదును కానుకగా ఇవ్వచ్చు. ఆ రసీదుతో వారే తమకు కావల్సిన మొక్కలను ఎంచుకుంటారు.



క్లే బాటిల్.. ఉడెన్ స్పూన్

పర్యావరణ హితమైన వాటిలో నిత్యం ఉపయోగపడేవి ఎన్నో అందుబాటులోకి వచ్చాయి. వాటిలో స్టోరేజీ బాస్కెట్, క్లే బాటిల్స్, ఉడెన్ స్పూన్స్, టెర్రకోట షోకేస్ లేదా కిచెన్ ఐటమ్స్, జూట్ బ్యాగ్స్.. ఇతర యాక్సెసరీస్ ఎంపిక చేసుకోవచ్చు.





రీ సైకింగ్..

ఫాస్ట్ ఫ్యాషన్‌లో కొట్టుకుపోతున్న ఈ రోజుల్లో మనవైన సంప్రదాయ హస్తకళలతో రూపుదిద్దుకున్న అలంకార వస్తువులను కానుకగా ఇవ్వచ్చు. వాటిలో ఫ్యాబ్రిక్, థ్రెడ్, ఉడెన్, టెర్రకోట జ్యువెలరీ, ఎంబ్రాయిడరీ చేసిన స్కార్ఫ్స్.. వంటివి ఎంచుకోవచ్చు. **ఇలాంటి ప్రత్యేకమైన కానుకలు సందర్భానికి తగిన విధంగా ఇస్తే ఆత్మీయులను మరింత చేరువ చేస్తాయి.**

బ్యూటిప్స్

బాదం గింజల్లో విటమిన్ ఇ పుష్కలంగా ఉంటుంది. ఇది చర్మానికి పోషణను అందిస్తుంది. అలాగే నిర్జీవంగా మారిన చర్మకణాలకు జీవం పోస్తుంది. పాలు చర్మాన్ని మాయిశ్చరైజ్ చేస్తాయి.



ఐదు నుంచి ఆరు బాదం గింజలను తీసుకొని వాటిని నానబెట్టాలి. బాగా నానిన తర్వాత వాటి తొక్క తీసి గింజలను పేస్ట్‌లా తయారు చేయాలి. ఆపై కొద్దిగా పాలు కలిపి ముఖానికి, మెడకు రాసి పావుగంట ఆరనివ్వాలి. ఆ తర్వాత చల్లటి నీటితో శుభ్రం చేసుకోవాల్సి ఉంటుంది.

ఈ ఫేస్ ప్యాక్ చర్మానికి ఇన్‌స్టంట్ బ్రైట్ నెస్ అందించడం మాత్రమే కాకుండా చర్మాన్ని అందంగా, మృదువుగానూ మారుస్తుంది. కాబట్టి దీనిని రెగ్యులర్ ఫేస్ ప్యాక్స్ మాదిరిగానూ ఉపయోగించవచ్చు.

ముగ్గు ముచ్చట



21 చుక్కలు : 21 వరసలు



మద్దల పద్మావతి
పెండోటవారి వీధి, తెనాలి



సరస్వతి
తాండూరు

18 చుక్కలు : 18 వరసలు



ముగ్గులు పంపవలసిన చిరునామా:
ముగ్గు-ముచ్చట, సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్,
నెం.1, బంజారాహిల్స్, హైదరాబాద్-34.
ఈ మెయిల్: muggulu.sakshi@gmail.com

* అడ్రస్‌లో మీ ఊరి పేరుతోపాటు మీ కాలనీ పేరు కూడా రాయండి.

సంవత్సర ఫలాలు



2023. ఈ సంవత్సరం అంకెలు మొత్తం కూడితే 2+0+2+3=7, వస్తుంది. 7 అంకె కేతుగ్రహానికి సంకేతం. దీని ప్రభావం వలన వైద్యం, ఆరోగ్యం, ఆధ్యాత్మికత, పురాతన గ్రంథాలు, మరుగున పడిన తాంత్రిక విద్యలు, ఆయుర్వేదం, జ్యోతిషం వంటి విద్యలలో సృజనాత్మక మార్పులు, అభివృద్ధి జరుగుతాయి. వైద్య విద్య, వైద్య పరిశోధనలపై ప్రజలకు, ప్రభుత్వానికి ఎక్కువ ఆసక్తి కలుగుతుంది. ఫైనాన్స్, మేనేజ్‌మెంట్ రంగంపై విద్యార్థులలో ఆసక్తి ఎక్కువ అవుతుంది. స్టాక్ మార్కెట్‌పై కూడా ఆసక్తి పెరుగుతుంది. స్టాక్ మార్కెట్ ఫిబ్రవరి వరకు అస్తవ్యస్తంగా ఉంటుంది. ఫిబ్రవరి 2023 తరువాత లాభదాయకంగా ఉంటుంది.

ఈ 2023 సంవత్సరం మొత్తం అంకెలు కలపగా 7 వస్తుంది. కాబట్టి ఈ సంవత్సరం మొత్తం కేతు ప్రభావం కూడా ఎక్కువగా ఉంటుంది. అదే విధంగా జ్యోతిషపరంగా చూసినా 2023 సంవత్సరం ఆదివారం, అశ్విని నక్షత్రం (01-01-2023)తో ప్రారంభం అయ్యి, ఆదివారం, మఖ నక్షత్రం (31-12-2023)తో ముగుస్తుంది. ఈ విధంగా ఈ సంవత్సరం కేతు నక్షత్రం (అశ్విని)తో మొదయ్యి, కేతు నక్షత్రం (మఖ)తో ముగుస్తుంది. అందువలన కేతు గ్రహ ప్రభావం ఎక్కువగా ఉంటుంది.

ఈ 2023 శోభకృత్ నామ సంవత్సరంలో ఆధ్యాత్మికత పెరుగుతుంది. కష్టాల నుండి విముక్తి కలిగి ఆత్మజ్ఞానం, తాత్విక జ్ఞానం, ఆత్మాభిమానం కలిగి మంచి పాజిటివ్ ఆలోచనలు కలిగి ప్రజలు అభివృద్ధి పథం వైపు అడుగులు వేస్తారు.

1, 10, 19, 28 తేదీలలో జన్మించినవారికి 2023 సంవత్సరంలో సూర్య, చంద్ర, కేతు గురు గ్రహాల ప్రభావం ఉంటుంది. గురు ప్రభావం వలన ఆకస్మిక ధనప్రాప్తి కలుగుతుంది. పరిశోధన, మైనింగ్ రాజకీయ రంగాలలో ఉన్న వారికి నూతన అవకాశాలు. బాధ్యతలు పెరుగుతాయి. దీనితోపాటు ఆర్థికవృద్ధి, అదృష్టం కలిసి వస్తాయి. కొత్త పథకాలు, వ్యాపారాల ద్వారా లాభాలు గడిస్తారు. విదేశాలలో విద్య, ఉద్యోగం కోసం ప్రయత్నించే వారికి ఇది మంచి సమయం. సంఘంలో గౌరవం పెరుగుతుంది. అవివాహితులకు వివాహ యోగం. వైవాహిక జీవితంలో ఉన్నవారికి స్పర్థలు, అపోహలు తొలగి మంచి వైవాహిక జీవితం గడుపుతారు. భార్య/భర్త ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి. నైతికత, విలువలు పాటించాలి. లేకపోతే సన్నిహితులు మిత్రులు దూరం అయ్యే అవకాశం ఉంది. అహం భావం విడిచిపెట్టి గొప్పవారి సాయం తీసుకుంటే లాభదాయకంగా ఉంటుంది. గత సంవత్సరంతో పోల్చితే ఈ సంవత్సరంలో సామాజికంగా పేరు ప్రఖ్యాతులు వస్తాయి. కోర్టు కేసుల్లో అనుకూలమైన తీర్పులు వస్తాయి.

ఆరోగ్యం మెరుగుపడుతుంది. మంచి ఆలోచనలు కలిగి మీ సమస్యలకు పరిష్కారం దొరుకుతుంది. నిరుద్యోగులకు ఉద్యోగప్రాప్తి, విద్యలో పూర్తి చేయని కోర్సులు ఉంటే అవి పూర్తి చేస్తారు. డిగ్రీ చేతికి వస్తుంది.

పరిశోధనా రంగం వైద్య రంగం జ్యోతిషం తాంత్రిక విద్యలు మొదలైన రంగాలలో ఉన్నవారికి 2023 సంవత్సరం చాలా మంచి సంవత్సరం. అధిక ఒత్తిడి తీసుకోకుండా శాంతంగా ఉంటూ అహంభావాన్ని విడిచి పెట్టి ప్రయత్నిస్తే ఈ సంవత్సరం మీ జీవితంలో నూతన అధ్యాయానికి నాంది అని చెప్పవచ్చు. దుర్గా సప్తసతి పారాయణ వలన మంచి ఫలితాలు పొందుతారు.

2, 11, 20, 29 తేదీలలో పుట్టినవారికి న్యూమరాలజీ ప్రకారం 2,7 చంద్రునికి సంబంధించిన అంకెలు. ఈ సంవత్సరంలో వీరికి ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. అవివాహితులకు వివాహయోగం. సృజనాత్మకత పెరుగుతుంది. రచయితలకు,నటులకు, కళాకారులకు ఇది మంచి సమయం. నటులకు, కళాకారుకి మంచి అవకాశాలు దొరికి, చిత్ర రంగంలో మంచి పేరు వచ్చే అవకాశం ఉంది. విద్యార్థులకు ఉన్నత విద్య అవకాశాలు ఉన్నాయి. ఈ సంవత్సరంలో సమాచార రంగం బాగుంటుంది. ఈ సంవత్సరం 23 సంఖ్య (2+3) కాబట్టి 5 బుధుడి సంఖ్య. దీనివలన స్టాక్ మార్కెట్‌లో అభివృద్ధి ఉంటుంది. సంవత్సర సంఖ్య లోని 3 గురుడుకి సంబంధించి సంఖ్య కావటం వలన పుట్టిన తేదీ (2,11,20,29) చంద్రుడికి సంబంధించినది కావటం వలన చంద్ర గురువుల కలయిక వలన రాజ యోగం కలుగుతుంది. స్నేహితులు, బంధువులతో సత్సంబంధాలు ఏర్పడతాయి. పాత మిత్రులను కలుస్తారు. కార్యాలయంలో గుర్తింపు వస్తుంది. గమ్యాలను చేరుకోగలుగుతారు. చాలా కాలంగా విదేశాలలో ఉన్నవారు స్వదేశం వస్తారు. అప్పు కోసం ప్రయత్నించేవారికి అప్పు దొరుకుతుంది. ఆకర్షణ శక్తి పెరిగి స్నేహితులు ఎక్కువ అవుతారు. గృహోపకరణ, విలాస వస్తువులు కొంటారు. నగదు కోసం ఇబ్బంది పడాల్సి వస్తుంది. అందువలన జాగ్రత్తగా ఖర్చు చెయ్యాలి. హీలింగ్ చేసేవారికి, వక్తలకు ఇది మంచి సమయం. విష్ణు సహస్ర నామం పారాయణం, శ్రవణం చేయటం, రుద్రాభిషేకం, హనుమాన్ చాలీసా పారాయణ వలన మంచి ఫలితాలు వస్తాయి. మీ ఆదాయంలో 2 నుంచి 10 శాతం వికలాంగులకు దానం చేయటం వలన మీ వృత్తిలో ఆదాయ వృద్ధి కలుగుతుంది.

3, 12, 21, 30 తేదీలలో జన్మించినవారికి గురు గ్రహ ప్రభావం ఎక్కువగా ఉంటుంది. వీరు నిరంతరం శక్తి సంపన్నులుగా, ఆశావాదులుగా ఉండి తమ ప్రతిభ ద్వారా ఇతరుల కంటే ఎక్కువగా రాణిస్తారు. వీరిపై బుధ, గురు, కేతు ప్రభావం ఉంటుంది. ఈ సంవత్సరంలో ఏ వయసు వారైనా కొత్త పరిజ్ఞానాన్ని పొందుతారు. వృత్తివిద్యలు, నూతన సాంకేతిక విద్యలు నేర్చుకుంటారు. విద్యార్థులకు మంచి సమయం. విదేశీ విద్య కోరిక నెరవేరుతుంది. వీరికి ఈ సంవత్సరం నూతన ఉత్సాహంతో నిర్మాణాత్మకంగా ఉంటుంది. మధ్యలో చదువు ఆపినవారు కొత్త కోర్సులు చేయాలనే కోరిక కలిగి ముందుకు వెళతారు. ఈ సంవత్సరంలో గౌరవ పట్టాలు పొందుతారు. వ్యవసాయదారులకు ఆదాయం పెరుగుతుంది. వేరుసెనగలు, కందులు, పసుపు పండించేవారికి లాభదాయకం. కొత్తకొత్త వ్యవసాయ పద్ధతులు అవలంబిస్తారు. సంతానం లేనివారికి సంతానం కలుగుతుంది. సంతానం ఉన్నవారి పిల్లలు ఉద్యోగం వచ్చి సెటిల్ అవుతారు. భార్యాభర్తల మధ్య అన్యోన్యత పెరుగుతుంది. షేర్‌మార్కెట్‌లో లాభాలు వస్తాయి. తండ్రికి మంచి సమయం. విదేశీ పర్యటన, పుణ్యక్షేత్రాల దర్శనం జరుగుతాయి. ఈ సంవత్సరంలో తీసుకొనే నిర్ణయాల వలన వచ్చే సంవత్సరంలో లాభాలు వస్తాయి. నైతికంగా ఉండాల్సిన అవసరం ఉంది. మే నుండి పిల్లల విషయంలో ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాలి.

దక్షిణామూర్తిని కొలవటం వలన మంచి ఫలితాలు వస్తాయి. ఆదాయంలో 2 నుంచి 10 శాతం పేద విద్యార్థులకు గురువులకు, ఇంటి పురోహితులకు దానం చేయటం వలన మంచి ఫలితాలు వస్తాయి.

4, 13, 22, 31 తేదీలలో జన్మించినవారిపై రాహు గ్రహ ప్రభావం ఎక్కువగా ఉంటుంది. రాహు గ్రహం మీద చాలా మందికి వ్యతిరేకత, అపోహలు ఉంటాయి. కానీ రాహు సంఖ్య 4 చాలా మంచి సంఖ్య. వీరు నిర్మాణాత్మక వైఖరి, వాస్తవిక పంథా, స్థిరత్వం, నైపుణ్యం, ప్రశాంతత శాస్త్రీయమైన బాధ్యతాయుతమైన ఆలోచన, కష్టించే గుణం నిజాయితీ, విశ్వాస పాత్రత, పట్టుదల కలిగి ఉంటారు.

బుధ రాహుల కలయిక వీరిని గొప్ప నిపుణులుగా చేస్తుంది. రాహు అంటే కొత్త సాంకేతిక నైపుణ్యం కలిగి ఉండటం. ఏ వయసులోవారైనా కొత్త టెక్నాలజీ నేర్చుకోవటం, ఆ రంగంలో ఉన్నవారు నూతన ఆవిష్కరణలు చేయటం, దాని వలన పేరు ప్రఖ్యాతులు, సంపద పొందటం జరుగుతుంది. కోర్టు కేసులలో విజయం లభిస్తుంది. వివాహం కానివారికి వివాహం జరుగుతుంది. వివాదాలలో ఉన్న వీరి స్థలం వీరికి లభిస్తుంది. కొత్త ఇల్లు కట్టుకుంటారు. పోటీ పరీక్షలలో ఉత్తీర్ణులై మంచి ఉద్యోగాలు సంపాదిస్తారు. రెండో పెళ్ళి కోసం ఎదురు చూసేవారికి ద్వితీయ వివాహం జరుగుతుంది. సంవత్సర సంఖ్యలో 3, జన్మ తేదీ రాహు సంఖ్య అవ్వటం వలన గురు ఛండాల యోగం పడుతుంది. కాబట్టి వీరు ఏ నిర్ణయమైనా తీసుకొనే ముందు ఆలోచించి విజ్ఞుల సలహాలు తీసుకొని చేస్తే మంచిది. గురు ఛండాల యోగం ఉన్నందున ప్రేమ వ్యవహారాలు, రిలేషన్ షిప్‌లో ఉండటం మంచిది కాదు. రాజకీయ నాయకులకు పదవులు లభిస్తాయి. ఎంతటి క్లిష్టమైన ఎన్నికలలోనైనా గెలుస్తారు.

సర్పదోష నివారణ పూజ, దక్షిణామూర్తి పూజ సుబ్రహ్మణ్య స్వామి పూజ చేయటం వలన మంచి జరుగుతుంది. పేదలకు, అనాథలకు, వికలాంగులకు అన్నదానం చేయడం మంచి ఫలితాన్ని ఇస్తుంది.

5, 14, 23 తేదీలలో జన్మించినవారు బుధ గ్రహ ప్రభావం వల్ల వీరు బహుముఖ ప్రజ్ఞాశాలురుగా ఉంటారు. క్రియాశీలత, సేచ్ఛా ప్రియత్వం, వినోదం, ఉల్లాసం, మంచి, ఆలోచనలు, తెలివి తేటలు, కార్య దక్షత కలిగి ఉంటారు. 2023 సంవత్సరం లో వీరిపై కేతుప్రభావం ఉంటుంది. సంవత్సరం 23(5) కాబట్టి బుధ ప్రభావం ఉంటుంది. వీరి జన్మతేదీ, సంవత్సర సంఖ్య రెండూ 5 కావడం వల్ల బుధ ప్రభావతో వీరి తెలివి తేటలకు, కార్య నిర్వహణకు గుర్తింపు వస్తుంది. పబ్లిక్ రిలేషన్స్, సేల్స్, పర్యాటక రంగం టీవీ, సినిమా పత్రికా రంగాలలో ఉన్నవారైతే మంచి గుర్తింపు వస్తుంది. వ్యవసాయదారులకు కూరగాయలు చెరుకు, పెసలు, మినుములు పండించేవారికి లాభదాయకంగా ఉంటుంది. వీరు కొత్త భూములు, పొలాలు కొనే అవకాశం ఉంది. పెట్టుబడులకు ఇది మంచి సమయం. వ్యాపారస్తులకు లాభాలు వస్తాయి. నూతన వ్యాపారాలు ప్రారంభిస్తారు. వ్యాపార లావాదేవీలలో డాక్యుమెంట్లపై సంతకం చేసేటప్పుడు కొంచెం జాగ్రత్తగా ఉండాలి. విద్యార్థులకు ఇది మంచి సంవత్సరం. పరీక్షలలో మంచి మార్కులతో ఉత్తీర్ణులవుతారు. నిరుద్యోగులు పోటీ పరీక్షలలో విజయం సాధిస్తారు. ఉద్యోగులు వేరే మంచి ఉద్యోగం కోసం చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి. తగినంత విశ్రాంతి తీసుకోవాలి. నోటిని అదుపులో ఉంచుకోకపోతే అవమానాలు జరుగుతాయి. ఆరోగ్యానికి సంబంధించి పంటి, కంటి పరీక్షలు చేయించుకోవాలి.

గణపతి ఆరాధన, రుద్రాభిషేకం వల్ల మంచి ఫలితాలు వస్తాయి. ఆదాయంలో రెండు నుంచి 10 శాతం దానం చేయటం మంచిది.

6, 15, 24 తేదీలలో జన్మించినవారు శుక్ర గ్రహ ప్రభావం వల్ల వీరికి కళాభిరుచి, సృజనాత్మకత, మానవ సేవ, విశ్వాస పాత్రత వంటి లక్షణాలు ఉంటాయి. త్యాగబుద్ధి, సేవాభావం కలిగి ఉంటారు. శుక్ర, బుధ సంబంధం వలన ఈ సంవత్సరం వైద్యం, జ్యోతిషం, తాంత్రిక సంబంధిత వృత్తుల వారికి చాలా మంచి కాలం. వైద్యులు నూతన వైద్యశాలలు ప్రారంభించే అవకాశం ఉంది. ఏ రంగంలో ఉన్నవారైనా ఆయా రంగాలలో పరిశోధనాత్మక వ్యాసాలు రాస్తారు. అవివాహితులకు వివాహ యోగం. ఈ సంవత్సరంలో వీరు ఎంతో ఆత్మతృప్తిని పొందుతారు. సంవత్సరమంతా చాలా రిలాక్స్‌డ్‌గా ఉంటారు. వివాహాది శుభకార్యాలు జరుగుతాయి. విదేశాలలో ఉన్నవారు స్వదేశం వచ్చి ఆనందంగా గడుపుతారు. విలాస వస్తువులు కొంటారు. ఊహించని ఆస్తి ప్రాప్తిస్తుంది. నటులు, సంగీతకారులకు, మీడియావారికి, నగల వ్యాపారులకు అనుకూలం. భాగస్వాములతో జాగ్రత్తగా ఉండాలి. రిలేషన్‌షిప్స్‌లో ఉండటం మంచిది కాదు. ప్రేమ వ్యవహారాలలో కూడా జాగ్రత్తగా ఉండాలి.

వీధి కుక్కలకు ఆహారం పెట్టడం, బీదవారికి దుప్పట్లు దానం చేయటం మంచిది. భృగు పాశుపత హోమం లేదా సుదర్శన హోమం చేయించుకోవటం మంచిది.

7, 16, 25 తేదీలలో జన్మించినవారిపై కేతు గ్రహ ప్రభావం ఉంటుంది. వీరికి తాత్విక చింతన, మానవాతీత శక్తులు ఉంటాయి. ఆధ్యాత్మికత మీద దృష్టి ఎక్కువగా ఉంటుంది. ఈ సంవత్సర సంఖ్య కూడా 2023(7) కేతు సంఖ్య. ఎవరికైనా జన్మ తేదీ, సంవత్సర సంఖ్య ఒక్కటిగా ఉన్నప్పుడు , వారిపై ఆ గ్రహ ప్రభావం సంపూర్ణంగా ఉంటుంది. వారు వారి రంగాలలో చక్కగా రాణిస్తారు. మంచి గుర్తింపు వస్తుంది. ఈ తేదీలలో పుట్టినవారు నర్సులు, వైద్యులు, డ్రగ్గిస్టులు, పురోహితులు, జ్యోతిషులుగా ఉంటారు. ఈ రంగాలలో ఉన్నవారికి ఈ సంవత్సరం అత్యంత లాభదాయకం అని చెప్పవచ్చు. విద్య, ఉద్యోగం కోసం విదేశాలకు వెళ్ళాలనుకొనేవారి కోరిక నెరవేరుతుంది. పుణ్యక్షేత్ర దర్శనం జరుగుతుంది. వీరికి యోగా, ధ్యానం వంటి విషయాలపై మక్కువ ఎక్కువ అవుతుంది. ఈ సంవత్సరం వీరు వ్యాపారంలో రిస్క్ తీసుకోవటం మంచిది కాదు. ప్రేమ వ్యవహారాలలో తల దూర్చకుండా ఉంటే మంచిది. కోర్టులకి, పోలీస్ స్టేషన్స్‌కి వెళ్ళకుండా, సమస్యలను సామరస్య పూర్వకంగా పరిష్కరించుకోవటం మంచిది. ఈ సంవత్సరం షేర్ మార్కెట్, స్పెక్యులేషన్‌కు దూరంగా ఉంటే మంచిది. వీరిలో అసాధారణ స్ఫురణ అధికంగా ఉండి ఆధ్యాత్మిక క్రమశిక్షణ పాటిస్తారు. వీరు వీరి రంగాలలో ప్రత్యేకమైన నైపుణ్యం సంపాదించి అందులో ప్రావీణ్యత సాధిస్తారు.

ఆంజనేయస్వామి ఆరాధన, గణపతి ఆరాధన వలన మెరుగైన ఫలితాలు పొందుతారు. దాన ధర్మాల వల్ల ఉపశమనం లభిస్తుంది.


8, 17, 26 తేదీలలో జన్మించినవారిపై శని ప్రభావం ఉంటుంది. ఇతరులకు సహాయ పడటం, అన్యాయాన్ని ఎదిరించడం వీరి లక్షణాలు. వీరిపై ఈ సంవత్సరం కేతు, బుధ, గురు గ్రహాల ప్రభావం ఉంటుంది. శని బుధ గ్రహాలు మిత్ర గ్రహాలు. అదే విధంగా శని, గురు గ్రహాలు కూడా మిత్ర గ్రహాలు. అందువలన వీరికి ఈ సంవత్సరం భౌతిక సంపదలు, అభీష్టసిద్ధి, విజయం ప్రాప్తిస్తాయి. నూతన ఉత్సాహం, శక్తి, మంచి గుర్తింపు, సంపద, కీర్తి లభిస్తాయి. ఇన్సూరెన్స్ నుంచి ధనం రావటం, ఇన్సూరెన్స్ రంగంలో ఉన్నవారికి మంచి ఆదాయం రావటం జరుగుతుంది. విద్యార్థులు పోటీ పరీక్షలలో విజయం సాధిస్తారు. ఉద్యోగ ప్రయత్నాలు ఫలిస్తాయి. ఆస్తులు కొంటారు. కోర్టు వ్యవహారాలలో విజయం సాధిస్తారు. ఆరోగ్యం విషయంలో జాగ్రత్త వహించాలి. గొప్పవారి పరిచయాలు కలుగుతాయి. ఏ రంగంలో ఉన్నవారికైనా ఈ సంవత్సరంలో మంచి ఫలితాలు ఉంటాయి. రాజకీయ నాయకులు చాలా క్లిష్టమైన ఎన్నికలలో కూడా విజయం సాధిస్తారు.

ఈ సంవత్సరంలో వీరిపై శని, కేతు, గురు, బుధ గ్రహాల ప్రభావం ఉండటం వలన వీరు రుద్రాభిషేకం, గణపతి, ఆంజనేయ, దక్షిణామూర్తి ఆరాధన వల్ల సత్ఫలితాలను పొందవచ్చు.

9, 18, 27 తేదీలలో జన్మించినవారిపై కుజ గ్రహ ప్రభావం ఉంటుంది. 2023 సంవత్సర సంఖ్య 7, కేతు సంఖ్య. జ్యోతిష శాస్త్ర ప్రకారం కేతువు, కుజుడు రెండూ ఒకే విధమైన ఫలితాలను ఇస్తాయి. అందువలన ఈ సంవత్సరం వీరికి మంచి సంవత్సరం అని చెప్పవచ్చు. ఈ సంవత్సర సంఖ్యలో ఉన్న 2,0,3 సంఖ్యలు చంద్ర, కేతు,బుధ, గురు గ్రహ ప్రభావాలను కలుగజేస్తాయి. కుజ గురు గ్రహ ప్రభావం వలన గురు మంగళ యోగం కలుగుతుంది. దీని వల్ల రియల్ ఎస్టేట్, మైనింగ్, మిలటరీ, పోలీస్ రంగాలలో ఉన్నవారికి మంచి సంవత్సరం. నిర్మాణం మధ్యలో ఆగిపోయినవి మరల మొదలయ్యి, పూర్తి అయ్యే అవకాశం ఉంది. ఈ సంవత్సరం పెండింగ్ పనులు అన్నీ పూర్తి అయ్యే అవకాశం ఉంది. కొత్త పనులు మొదలు పెట్టడానికి ఇది మంచి సమయం కాదు.

పైకి ధైర్యంగా కనిపించినా, లోలోపల పిరికిగా ఉంటారు. ఆరోగ్యం విషయంలో జాగ్రత్త వహించాలి. రిలేషన్‌షిప్స్‌లో ఉన్నవారికి అంత బాగోదు. మనీ మేనేజ్‌మెంట్‌లో జాగ్రత్త అవసరం. అనవసర వాద వివాదాలకు దూరంగా ఉండాలి. హనుమాన్, సుబ్రహ్మణ్య ఆరాధన చేయాలి. అంగారక పాశుపత హోమం చేయించుకుంటే మంచిది. రక్తదానం చేస్తే మంచిది.

గ్రహగతులు, వాటి ప్రభావాన్ని పరిశీలించి చూస్తే, ఈ సంవత్సరంలో అందరూ తగు ప్రయత్నంతో అభివృద్ధి పథంలో పయనిస్తారు. శుభకృత్ నామ సంవత్సరం తరువాత 2023లో వచ్చే శోభకృత్ నామ సంవత్సరం, సార్థక నామధేయంతో అందరికీ కొత్త శోభను తెచ్చి పెడుతుంది.



- మహమ్మద్ దావూద్
ఆస్ట్రో-న్యూమరో-గ్రాఫాలజిస్ట్
హైదరాబాద్.